**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభా' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417



# సూర్య ప్రభా

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 2 సంచిక: 4 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | ఆదివారం, జూన్ 29 2025 | పేజీలు : 4





## మోదీకి ధర్మ చక్రవర్తి బిరుదు ప్రదానం

న్యూఢిల్లీ: జైన సన్యాసి ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి 'ధర్మ చక్రవర్తి' బిరుదును శనివారంనాడు ప్రదానం చేశారు. ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్‌కు ఏడాది పొడవునా నిర్వహించే జాతీయ నివాళికి నాంది పలుకుతూ ఈ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జైన నేత ఆధ్యాత్మిక, పండిత వారసత్వాన్ని స్మరించుకునేందుకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఢిల్లీలోని భగవాన్ మహావీర్ అహింసా భారత్ ట్రస్టు సహకారంతో ఈ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ధర్మ చక్రవరి బిరుదును ప్రధాని స్వీకరిస్తూ, తనను తాను ఈ బిరుదుకు అర్హుడనని భావించడం లేదని, అయితే సాధువుల నుంచి ఏది స్వీకరించినా దానిని ప్రసాదంగా స్వీకరించాలనేది మన సంస్కృతి అని చెప్పారు. ఈ ప్రసాదాన్ని తాను వినయంగా స్వీకరిస్తూ తల్లి భారతికి అంకితమిస్తున్నానని అన్నారు. ఆచార్య విద్యానంద్ జీ 1987 జూన్ 28న 'ఆచార్య' బిరుదును అందుకున్నారని ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఇది కేవలం గౌరవం కాదని, జైన సంస్కృతిని సంయమనం, కరుణతో అనుసంధానించే పవిత్ర ధార అని అన్నారు. క్రమశిక్షణ, సన్యాసి జీవితాన్ని గుర్తుచేసే వేడుకలు ఇవని పేర్కొంటూ ఆచార్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్ స్మారక పోస్టల్ స్టాంపును ప్రధానమంత్రి మోదీ, కేంద్ర సంస్కృతి, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ విడుదల చేశారు. దీనికి ముందు 'లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ ఆచార్య శ్రీ 108 విద్యానంద్ జీ మహారాజ్' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మోదీ, షెకావత్ సందర్శించారు. ఆచార్య ఆధ్యాత్మిక ప్రయాణంలోని కీలక ఘట్టాలను గుర్తు చేసే కుడ్యచిత్రాలను ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు.




దేశవ్యాప్తంగా వచ్చే రెండు, మూడు రోజుల్లో మళ్లీ వానలు కురియనున్నట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో కోంకణ్ – గోవా, మధ్య మహారాష్ట్ర గాట్ ప్రాంతాలు, గుజరాత్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియనున్నాయి. అలాగే హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్ (జూన్ 29 నుంచి జూలై 2), తూర్పు రాజస్థాన్, విదర్భ ప్రాంతాల్లో కూడా వర్షాలు పడే అవకాశముంది.

**తెలుగు రాష్ట్రాల్లో...** ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలను కూడా నైరుతి రుతుపవనాలు కప్పేశాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ ఓ కీలక ప్రకటన చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నెమ్మదిగా బలహీనపడుతోందని తెలిపింది. అయితే దీని ప్రభావంతో వచ్చే 3 రోజులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రాంతాన్ని బట్టి తక్కువ నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్సుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సముద్రతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెదర్ రిపోర్ట్ సూచించింది.

**ఈ ప్రాంతాల్లో మాత్రం..** ఐఎండీ ప్రకారం జూన్ 29 నుంచి జూలై 2 వరకు ఉత్తర ప్రదేశ్‌లో వానలు పడనున్నాయి. జూన్ 27 నుంచి జూలై 3 వరకు మధ్యప్రదేశ్‌లో, జూలై 1, 2న ఛత్తీస్‌గఢ్‌లో, జూన్ 29, 30న పశ్చిమ బెంగాల్‌లో, జూన్ 30 నుంచి జూలై 1న ఒడిశాలో, జూన్ 29న ఝార?ండ్‌లో వర్షాలు కురియనున్నాయి. కేరళలో ఈరోజు భారీ వర్షాలు పడనున్నాయి.





హైదరాబాద్‌లోని మహా న్యూస్ కార్యాలయం వద్ద శనివారం ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఫోన్ ట్యాపింగ్ వివాదంపై ప్రసారం చేసిన కథనాల్లో తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ పేరును ప్రస్తావించడంపై BRS కార్యకర్తలు తీవ్రంగా స్పందించారు. వారు ఆగ్రహంతో ఆఫీసు వద్దకు చేరుకుని అద్దాలు పగలగొట్టడం, వాహనాలు ధ్వంసం చేయడం, స్టూడియోలోకి ప్రవేశించి పరికరాలు నాశనం చేయడం వంటి చర్యలకు దిగారు. ఈ అల్లర్ల నేపథ్యంలో మీడియా ప్రతినిధులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ దాడి సమయంలో మాహాన్యూస్ స్టూడియోలో ప్రముఖ యువ హీరో సుహాస్ కూడా ఉన్నారు. ఆయన తన తాజా సినిమా 'ఉప్పు కప్పురంబు' ప్రమోషన్ కోసం ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కానీ అకస్మాత్తుగా జరిగిన ఈ ఘర్షణతో ఆందోళన చెందిన సుహాస్, తక్షణమే ఆఫీసు నుంచి బయటకు వెళ్లిపోయారు. ఒక మీడియా సంస్థ ఆఫీసులోనే ఇలాంటి ఉద్రిక్తతలు జరగడం చూసి ప్రజలు, జర్నలిస్టులు, సినీ ప్రముఖులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగారు. పరిస్థితిని అదుపులోకి తేవడంతో పాటు, అల్లర్లు చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛపై మరోసారి ప్రశ్నలు రేపింది. చర్చలు, అభిప్రాయ భేదాల వల్ల ఏర్పడే రాజకీయ అసహనం ఈ స్థాయికి చేరడం ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మీడియా తప్పు చేస్తే న్యాయపరమైన మార్గాలు ఉన్నాయి కానీ హింసతో స్పందించడం ఏ విధంగానూ సమర్థించదగినది కాదు.

# భాగ్యనగర్ అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

## పీజేఆర్ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

## నియోజకవర్గాల పునర్విభజన.. సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్:2029లో నియోజకవర్గాల పునర్విభజన జరగబోతోందని.. శేరిలింగంపల్లి 4 నియోజకవర్గాలుగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు . హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో పీజేఆర్‌ది కీలకపాత్ర అని కొనియాడారు. పీజేఆర్ కృషి వల్లే హైదరాబాద్‌కు గోదావరి, కృష్ణా జలాలు వచ్చాయని ఉద్ఘాటించారు. ఇవాళ(శనివారం) పీజేఆర్ ఫ్లైఓవర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. కొండాపూర్–గచ్చిబౌలి మార్గంలో 6 లైన్లతో 1.2 కిలోమీటర్ల ఫ్లైఓవర్‌ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది. రూ.182.72 కోట్ల వ్యయంతో ORR నుంచి కొండాపూర్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. పీజేఆర్ ఫ్లైఓవర్‌తో గచ్చిబౌలి చౌరస్తా దగ్గర ట్రాఫిక్ సమస్య తగ్గనుంది. పీజేఆర్ ఫ్లైఓవర్‌ని ప్రారంభించిన అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధి కోసం చాలామంది హైదరాబాద్ వస్తుంటారని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పేదల నాయకుడిగా పీజేఆర్ గొప్పపేరు సంపాదించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ప్రజలు ఎప్పుడు పిలిచినా పలికే నాయకుడు పీజేఆర్ అని అభివర్ణించారు. గతంలో పీజేఆర్ ఇల్లు ఒక జనతా గ్యారేజ్‌లా కనిపించేదని గుర్తుచేసుకున్నారు. జంటనగరాల్లో 25 ఏళ్లపాటు పీజేఆర్ శకం నడిచిందని గుర్తుచేసుకున్నారు. పీజేఆర్ మంత్రిగా ఉన్నప్పుడే హైటెక్ సిటీకి పునాది పడిందని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. గతంలో హైటెక్ సిటీని ముందుకు తీసుకెళ్లింది చంద్రబాబే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. భాగ్యనగర అభివృద్ధికి ఎవరూ అడ్డుపడినా ఊరుకునేది లేదని హెచ్చరిచారు. ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధిపైనే తమ దృష్టి అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలని కోరారు. అభివృద్ధిలో స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొందరూ అడ్డుకునే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం ముసుగులో అవాంతరాలు కల్పిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఏపీ, తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎన్నికకు డేట్ ఫిక్స్

# రథసారథుల ఎంపికకు వేళాయె!

## జూలై 1న తెలుగు రాష్ట్రాల భాజపా అధ్యక్షుల ఎన్నిక!

హైదరాబాద్: భాజపా సంస్థాగత ఎన్నికల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. తెలుగు రాష్ట్రాల అధ్యక్షుల నియామకాలకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. రెండు తెలుగు రాష్ట్రాలకు ఒకే రోజు అధిష్ఠానం అధ్యక్షులను ప్రకటించనుంది. భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. సోమవారం నామినేషన్లు స్వీకరిస్తారు. జులై 1న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ మేరకు పార్టీ ప్రకటన విడుదల చేసింది.

**ఏపీలోనూ..** భాజపా ఏపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. మూడు రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని అధిష్ఠానం నిర్ణయించింది. పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ విజయవాడలో మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. జూలై 1వ తేదీన పార్టీ నూతన అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. 30వ తేదీన నామినేషన్ స్వీకరణ.. అదే రోజు సాయంత్రంలోపు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు.

**తెలంగాణ బీజేపీ అధ్యక్ష పీఠం రేసులో ఉన్నది వీరే..** తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం దృష్టి సారించింది. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కీలక నిర్ణయాలను తీసుకుంటోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలను ఎవరికి అప్పగించాలనే విషయంపై దాదాపుగా కసరత్తు పూర్తి చేసింది. ఫైర్ బ్రాండ్ ముద్ర ఉన్న బలమైన నాయకుడికి చేతికి బీజేపీ తెలంగాణ రాష్ట్రశాఖ పగ్గాలు అందడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మద్దతు పుష్కలంగా ఉన్న నాయకుల పేర్లను షార్ట్ లిస్ట్ చేసినట్లు చెబుతున్నారు. సామాజిక వర్గ సమీకరణాలను సైతం దీనికి ప్రాతిపదికగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆయన వారసుడిని పార్టీ ఎంపిక చేయాల్సి ఉంది. దీనికోసం సీనియర్ నేతల పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందర్ రావు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, చింతల రామచంద్రారెడ్డి, మురళీధర్ రావు పేర్లు వినిపిస్తోన్నాయి. మహిళను పార్టీ అధ్యక్షురాలిగా చేయాలనుకుంటే మహబూబ్ నగర్ లోక్ సభ సభ్యురాలు డీకే అరుణకు ఆ అవకాశం దక్కుతుందని సమాచారం. రామచంద్ర రావుతో పాటు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్.. ఈ పదవి కోసం ఫ్రంట్ రన్నర్లుగా నిలిచారు. మహిళా నాయకత్వం వైపు మొగ్గు చూపితే డీకే అరుణను ఖరారు చేయవచ్చని అంటున్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం తెలంగాణలో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ పర్యటన సందర్భంగా పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడి పేరును ఖరారు చేస్తారని చెబుతున్నారు. అనుభవం ఉన్న వారికి పార్టీ పగ్గాలను ఇవ్వాలనుకుంటే ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు జీ కిషన్ రెడ్డిని కొనసాగించడం లేదా మళ్లీ బండి సంజయ్ కు ఆ హోదాను అప్పగించడం బీజేపీ అధిష్ఠానం ముందు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలు. కిషన్ రెడ్డి అదే పదవిలో కొనసాగడానికి పెద్దగా ఇష్టపడట్లేదనే ప్రచారం ఉంది. కొత్త వారిని ఎంపిక చేయాలనుకుంటే ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రాంచందర్ రావు లేదా డీకే అరుణల్లో ఒకరిని పార్టీ అధ్యక్ష పీఠం వరిస్తుంది. ఈ నలుగురిలో కూడా ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న వారిని ఎంపిక చేయడానికే పార్టీ అగ్రనాయకత్వం మొగ్గు చూపుతుది. ఆ పరిస్థితే వస్తే ధర్మపురి అరవింద్, రాంచందర్ రావులల్లో ఒకరి పేరు ఖరారవుతుంది.

**ఎవరిదో పై చేయి... ఏపీ బీజేపీ కేంద్ర నాయకత్వం వ్యూహం మారుస్తుందా?...** ఆంధ్రప్రదేశ్ బీజేపీకి కొత్త నాయకత్వం రాబోతుందా? బీజేపీ కేంద్ర నాయకత్వం వ్యూహం మారుస్తుందా? చిన్నమ్మను తప్పిస్తుందా? కొత్త వ్యక్తికి పగ్గాలు అప్పగించనున్నారా? అంటే అవుననే అంటున్నారు.

**కేంద్ర నాయకత్వం ఆలోచన...?...** ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంద్రీశ్వరిని కొనసాగిస్తారా? లేక కొత్త వ్యక్తికి బాధ్యతలను అప్పగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే బీజేపీ కేంద్ర నాయకత్వం ఆలోచన ఎలా ఉందన్నది ఆసక్తికరంగానూ ఉత్కంఠతతోనూ ఉంది. 2024 ఎన్నికల్లో పురంద్రీశ్వరి బీజేపీ అధ్యక్షురాలిగా ఉండటంతో కూటమి ఏర్పడింది. పొత్తులు సజావుగా జరిగాయి. అయితే పురంద్రీశ్వరి పదవీ కాలం పూర్తి కావడంతో ఖచ్చితంగా తిరిగి అధ్యక్ష ఎన్నిక జరగాల్సి ఉంది. బీజేపీలో ఓటర్ల జాబితాను కూడా నేడు విడుదల చేయనున్నారు. ఎన్నిక నామమాత్రమేనని, కేంద్ర నాయకత్వం ఇప్పటికే ఒకపేరును ఖరారు చేసి ఉంటుందన్న ప్రచారం మాత్రం జరుగుతుంది.

**రెండు వర్గాలుగా...** ఎవరు అవునన్నా కాదన్నా ఏపీ బీజేపీలో రెండు గ్రూపులున్నాయి. ఒకటి చంద్రబాబు వ్యతిరేక వర్గం కాగా, మరొకటి అనుకూల వర్గం. ఒకవర్గం చంద్రబాబు తో పొత్తు కారణంగానే రాష్ట్రంలో ఎదగలేకపోతున్నామని భావించే వారుండడగా, టీడీపీ మద్దతు లేకుండా సింగిల్ సిటు కూడా గెలవలేని పరిస్థితుల్లో కలసి నడవడమే మంచిదన్నది మరొకవర్గం అభిప్రాయం.

భిన్నాభిప్రాయా లతో రెండు వర్గాల్లో ఎప్పటి నుంచో ఉన్నాయి. అయితే ఇప్పుడు ఏ వర్గానికి చెందిన వారు బీజేపీ అధ్యక్షుడవుతారన్నది కూటమి పార్టీల్లోనూ టెన్షన్ నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది ఈ ఎన్నిక ద్వారా అర్థమవుతుందని, జగన్ పార్టీ నేతలు కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మొత్తం మీద జరిగేది బీజేపీ అధ్యక్ష ఎంపిక అయినా ఏపీ రాజకీయాల్లో మాత్రం భవిష్యత్ పరిణామాలను సూచిస్తుందని చెబుతున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# ఛార్జింగ్‌లో జాప్యం ఉండదిక!

హైదరాబాద్: పెరుగుతున్న విద్యుత్తు వాహనాలకు తగ్గట్టుగా ఈవీ ఛార్జింగ్ పాయింట్లకు వేగవంతంగా కనెక్షన్ల మంజూరుపై విద్యుత్తు పంపిణీ సంస్థ దృష్టి పెట్టింది. కేటగిరి-9 కింద కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందన్న ఛార్జింగ్ ఆపరేటర్ల ఫిర్యాదుల నేపథ్యంలో డిస్కం ఇకపై ప్రతి వారం సమీక్ష చేయాలని నిర్ణయించింది. ఆ వారంలో ఎన్ని కనెక్షన్లు మంజూరు చేశారు? పెండింగ్‌లో ఉండటానికి కారణాలు ఉన్నాయా? అంటూ ఇటీవల డిస్కం సమీక్షించింది. ఇప్పటివరకు సిటీలోని 9 సర్కిళ్ల పరిధిలో 271 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 218 ఈవీ పాయింట్లకు కనెక్షన్లు కావాలని దరఖాస్తు చేసుకోగా.. సిటీలోనే 117 వరకు ఉన్నాయి. విజయవాడ, బెంగళూరు హైవేల



మార్గంలోని కనెక్షన్లు కూడా కలిపి వీటి సంఖ్య 159గా ఉంది.

**పాతబస్తీలో అత్యల్పంగా...**

హైదరాబాద్ సౌత్ పరిధిలోకి వచ్చే పాతబస్తీలో అత్యల్పంగా ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటివరకు 18 ఉండగా.. కొత్తగా ఏర్పాటుకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. బంజారాహిల్స్ సర్కిల్‌లో ప్రస్తుతం 25 ఉండగా కొత్తగా 8 రాబోతున్నాయి.

**అత్యధికంగా..**

హబ్సిగూడ సర్కిల్లో ప్రస్తుతం 50 ఛార్జింగ్ పాయింట్లు ఉండగా కొత్తగా 18బీ మేడ్చల్‌లో ప్రస్తుతం 46 ఉండగా కొత్తగా 7, సైబర్‌సిటీ సర్కిల్లో ప్రస్తుతం 33 ఉండగా.. కొత్తగా 20 ఛార్జింగ్ పాయింట్లు రానున్నాయి.

# జలమండలికి బకాయిల భారం

హైదరాబాద్: మహానగరానికి తాగునీటిని అందిస్తున్న జలమండలి బకాయిల భారంతో సతమతమవుతోంది. సుమారు రూ.3,000 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. వీటి వసూలుకు జలమండలి చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగడంలేదు. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి వసూలు కావాల్సిందే అత్యధికంగా ఉన్నాయి. బల్క్ కాలనీల బకాయిలతోపాటు వాణిజ్య కనెక్షన్ల నుంచి భారీ మొత్తంలో వసూలు కావాల్సి ఉంది. మొండి బకాయిల వసూలుపై జలమండలి చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడంలేదు.



**అవకాశం ఇచ్చినా..:** గతేడాది వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం అమలు చేసినా స్పందన నామమాత్రంగా ఉంది. పరిశ్రమలు నుంచి వసూలు కావాల్సింది రూ.282 కోట్లు ఉన్నా వీటిలో మూతపడినవి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మొండి బకాయిల వసూలుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశంపై జలమండలి తర్జనభర్జన పడుతోంది. జలమండలికి నెలకు రూ.130 కోట్ల ఆదాయం వస్తోంది. వేతనాలు, ఇతరత్రా ఖర్చుల రూపంలో నెలకు రూ.260 కోట్లు వ్యయం అవుతోంది. రాబడి, వ్యయాల మధ్య సుమారు రూ.130 కోట్ల మేర అంతరం ఏర్పడుతోంది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. కనీసం బకాయిలైన వసూలైతే కొంతమేర ఉపశమనం ఉంటుందని జలమండలి భావిస్తున్నా నెరవేరడం లేదు.

# బల్దియాలో ఇంజినీర్ల కుర్చీలాట

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో విబేధాలు తీవ్రమయ్యాయి. ప్రస్తుత ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ)పై సీనియర్ ఇంజినీర్లు పురపాలకశాఖకు ఫిర్యాదు చేయగా.. పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీర్ల సంఘం కూడా.. అదే విషయమై పురపాలకశాఖ కార్యదర్శి ఇలంబర్తికి లేఖ రాసింది. అడ్డదారిలో పదోన్నతి పొంది నాలుగు కీలక పోస్టులు చేజిక్కించుకున్నారంటూ ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డిపై విమర్శలు చేసింది. దాదాపు ఆరు నెలలుగా జీహెచ్ఎంసీలో ఈ గందరగోళం నడుస్తోంది. ఇంజినీరింగ్ ఉన్నతాధికారులంతా.. నిలిచి పోయిన పదోన్నతులు, పదవుల చుట్టూనే తిరుగుతున్నారు. హెచ్-



సిటీ పేరుతో తలపెట్టిన రూ.7వేల కోట్ల పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని, రూ.600కోట్ల వరద నాలాల నిర్మాణాన్ని, రహదారుల నిర్వహణ, ఇతరత్రా ప్రాజెక్టులను గాలికొదిలేశారు. వర్షాకాల సన్నద్ధతపైనా చేతులెత్తేశారు. చివరి నిమిషంలో హైడ్రా ఆ బాధ్యతను తీసుకుంది. ఇంత జరుగుతున్నా.. ప్రభుత్వం ఇంజినీరింగ్ విభాగంలో నెలకొన్న సమస్యను పరిష్కరించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఈఎన్‌సీపై రచ్చ..**

జీహెచ్ఎంసీలో ప్రాజెక్టులు, పరిపాలన విభాగం చీఫ్ ఇంజినీరుగా, ఎంఆర్‌డీసీఎల్‌లో సీఈగా, ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీగా పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డిపై తాజాగా ఇంజినీర్ల సంఘం పురపాలకశాఖ కార్యదర్శికి లేఖ రాసింది. "2018 నాటి సీనియారిటీ జాబితా ప్రకారం కోటేశ్వర రావు, నర్సింగ్‌రావు, సహదేవ్‌రత్నాకర్, ప్రవీణ్‌చంద్ర, దత్తుపంత్, విశ్వనాథరాజు తర్వాత ఈఎన్‌సీ భాస్కర్‌రెడ్డి పేరు ఉంటుంది. అయినప్పటికీ.. ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి ఆయన పదోన్నతి తీసుకున్నారు" లేఖలో పేర్కొంది. మరోవైపు సీనియారిటీ జాబితాలో ముందున్న తనకే ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీ పోస్టు దక్కాలని ఎస్ఎన్‌డీపీ ముఖ్య ఇంజినీరు కోటేశ్వరరావు సైతం సర్కారుకు లేఖ రాశారు.

# కాజేసేది.. ఫ్రీజ్ చేయించేది వారే!



హైదరాబాద్: మహానగరంలో మాయగాళ్లు కొత్త తరహాలో సొమ్ము కొట్టేస్తున్నారు. ఇటీవల నారాయణగూడలో పచారీ దుకాణం వద్దకు ఓ యువకుడు వచ్చాడు. తనకు నగదు ఇస్తే యూపీఐ ద్వారా తిరిగి బదిలీ చేస్తానన్నాడు. ప్రతిఫలంగా రూ.1000కి రూ.100 కమీషన్ ఇస్తానని చెప్పటంతో వ్యాపారి అంగీకరించాడు. అతడు రూ.33 వేలు ఫోన్‌పే నుంచి పంపాడు. రెండు గంటల తరువాత వ్యాపారి బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయింది. మరో ఘటనలో చాంద్రాయణగుట్టలో మినీ ఏటీఎం నిర్వాహకుడికి 5 శాతం కమీషన్ ఇచ్చి రూ.లక్షన్నర తీసుకున్నారు. మూడ్రోజుల తరువాత బ్యాంకు లావాదేవీలు స్తంభించాయి. రెండు నెలల వ్యవధిలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. అపరిచితులతో లావాదేవీలు నిర్వహించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**యూపీఐ మోసాల్లో ఇదో రకం..**

చిరు వ్యాపారులు, మినీ ఏటీఎంల నిర్వాహకుల వద్దకు వెళ్లి, తమకు నగదు ఇస్తే యూపీఐ ద్వారా తిరిగి ఇస్తామంటారు. నగదును బట్టి 5-15 శాతం వరకూ కమీషన్ ఇస్తామంటారు. ఒకట్రెండు రోజుల అనంతరం నగదు ఇచ్చిన వారి బ్యాంకు ఖాతాల లావాదేవీలు నిలిచిపోయేలా చేస్తారు. బ్యాంకుకెళ్లి ఆరా తీసినప్పుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు అందిన ఫిర్యాదు కారణమని తెలుసుకుంటున్నారు. స్థానిక ఠాణాలో తెలుసుకుంటే ఫిర్యాదు చేసిన వ్యక్తులు ఇతర రాష్ట్రాల వారని, అక్కడికి వెళ్లి వారితో మాట్లాడుకోవాలని సూచిస్తున్నట్లు సమాచారం. కొద్ది రోజులకు ఫిర్యాదు చేసిన వ్యక్తులు ఫోన్ చేసి.. ఫ్రీజ్ చేసిన నగదులో సగం వాటా ఇస్తే కేసు వెనక్కి తీసుకుంటామంటూ బేరసారాలు ప్రారంభిస్తున్నారు. నగదు తీసుకునే వెసులుబాటు లేకపోవడంతో రాజీ పడుతున్నట్లు తెలుస్తోంది.

**అంతర్రాష్ట్ర ముఠాల పనేనా?** ఈ నేరాలకు పాల్పడుతున్నది అంతర్రాష్ట్ర ముఠాలు కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు ముఠాగా ఏర్పడి పథకం ప్రకారమే.. ఒకరు నగదు తీసుకుంటుంటే, మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ వస్తుందనగానే చెల్లింపులు జరిపి నష్టపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్, డ్రగ్స్ నిందితులకు సహకరించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

# గిరి వికాసం.. ఎంపికలో ఆలస్యం



సిరిసిల్ల : ఈ పథకం పర్యవేక్షణ పూర్తిగా గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్) కరీంనగర్‌లోని కార్యాలయంలోనే ఉంది. గతనెలలో ఈ శాఖలో పనిచేసే గిరిజన సంక్షేమాధికారి బదిలీపై వెళ్లారు. దీంతో ఈ పథకంలో ఇప్పటికీ అర్హులైన రైతుల ఎంపిక, భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకాల కోసం జియాలజిస్టులతో పరిశీలన తదితర పనులన్నీ పూర్తిచేయాలి. ఇప్పటికీ లబ్ధిదారుల ఎంపికనే జరగలేదు. రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉన్న రైతును ఒక యూనిట్గా అంతకన్నా తక్కువ ఉన్న పక్షంలో ఇద్దరి నుంచి అయిదు మంది రైతులతో కలిపి ఒక యూనిట్గా చేసి పథకాన్ని అమలు చేస్తారు. గిరిజన రైతులను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని తీసుకొచ్చింది. వరి, పత్తి వంటి ఉద్యాన పంటలతో ఆదాయం సమకూర్చడం ప్రధాన ఉద్దేశం. జిల్లాలో ఈ పథకంలో 1,747 మంది రైతులు అర్హులుగా గుర్తించారు. వీరికి అయిదేళ్లలో రూ.104 కోట్లు ఖర్చు చేయనుంది. అటవీ గ్రామాల్లో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో తొలివిడత 350 ఎకరాల్లో వంద మంది రైతులకు మేలు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ వ్యయానికి ఇక్కడి పరిస్థితులకు వేరుగా ఉన్నాయి. అన్ని ప్రాంతాలు బోరుబావులకు అనుకూలంగా లేవు.

**అమలు చేస్తేనే పథకం సఫలీకృతం**

వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలాల్లో కొంతమేరకు విద్యుత్తు వరసలు అందుబాటులో ఉన్నాయి. రుద్రంగి, చందుర్తి మండలాల్లో బోరుబావులకు అనుకూలంగా లేవు. పోడు పట్టాలు ఉన్నా.. అటవీ గ్రామాల్లో చాలా చోట్ల 200 అడుగుల్లో నీళ్లుండే పరిస్థితి లేదు. సోలార్ పంపు సెట్లు గరిష్ఠంగా 200 అడుగుల లోతులో ఉండే నీటిని సమర్థంగా తోడుతాయి. దీంతో యూనిట్ వ్యయం రూ.6 లక్షలకు మించే అవకాశాలు ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లోని భూభౌతిక పరిస్థితుల నేపథ్యంలో రైతులు బోరుబావులకు బదులుగా చేదబావులు తవ్వుకుంటున్నారు. బోరుబావుల తవ్వకంతో పోలిస్తే అధికంగా ఖర్చవుతుంది. అవసరమైన చోట అధికంగా ఖర్చుచేసేలా నిధులు సర్దుబాటు చేసి పథకాన్ని సమర్థంగా అమలు చేస్తేనే పథకం సఫలీకృతం అవుతుంది. వీర్నపల్లి మండలం ఎర్రగడ్డతండాలో 70 ఎకరాలు పోడు సాగు చేస్తున్నారు. విద్యుత్తు సరఫరా లేదు. దీంతో 50 మంది రైతులు కలిసి సమీపంలోని ధర్మారం చెరువు, ఇతర బోరుబావుల నుంచి మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ పంటలకు నీరందిస్తున్నారు. పంట పూర్తయ్యాక నీళ్లిచ్చిన రైతులకు ఎకరానికి ఇంతా అని డబ్బులు చెల్లిస్తున్నారు.

# అందని నిధులు.. భారంగా విధులు



ధర్మారం : సుల్తానాబాద్ మండలం గొల్లపల్లిలోని చెత్త ట్రాలీ ఇది. గతంలో ఇంటింటికీ తిరిగి రోజుకు రెండు ట్రిప్పుల చెత్తను తరలించేవారు. ట్రాలీ అడుగు భాగం పూర్తిగా దెబ్బతినడంతో ఏడాది కాలంగా సేకరణ నిలిచిపోయింది. మరమ్మతుకు రూ.80 వేలు అవసరం. పంచాయతీలో నిధులు లేక అద్దె ట్రాక్టరులో చెత్తను తరలిస్తున్నారు. గ్రామాల్లో పనులు చేసేందుకు ఆర్థిక వనరులు లేకపోవడంతో ముందడుగు పడటంలేదు. అభివృద్ధి పనుల మాట అటుంచి.. కనీస అవసరాలకూ ఖర్చుచేసే పరిస్థితి లేదు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు, వీధి దీపాల నిర్వహణ తదితరాలకు ఎక్కువ నిధులు అవసరమవునుండగా.. పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. జిల్లాలో 266 పంచాయతీలకుగానూ 260 మంది కార్యదర్శులు పనిచేస్తున్నారు.

**కార్యదర్శులు అప్పులపాలు**

పాలకుర్తి మండలంలో గతేడాది వరకు పనిచేసిన ఓ కార్యదర్శి.. అక్కడ వివిధ అత్యవసర పనులు చేసేందుకు సొంతంగా ఖర్చు పెట్టారు. 11 నెలల క్రితం ధర్మారం మండలంలోని మేజర్ పంచాయతీకి వచ్చారు. పలు పనులకు రూ.4 లక్షల ఖర్చయింది. పైపులైన్ల లీకేజీల సవరణ, ఇతరత్రా ఖర్చులకు తన జేబు నుండి రూ.50 వేల వరకు ఖర్చు చేశానని సదరు కార్యదర్శి వాపోయారు. జూలపల్లి మండలంలో విధులు నిర్వహించిన ఓ కార్యదర్శి.. గతేడాది వేసవిలో మంచినీటి సరఫరా పనులకు ఉన్నతాధికారుల ఆదేశాలతో రూ.1.20 లక్షలు వెచ్చించి చేయించారు. ఇప్పటికీ బిల్లు రాలేదు. బదిలీపై ధర్మారం మండలానికి వచ్చారు. అక్కడ రూ.2 లక్షలు ఖర్చు చేశారు. తన వేతనంతోపాటు.. తన తల్లిదండ్రులనుండి నగదు తీసుకొని చేయిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా జిల్లాలో గతేడాది వేసవిలో తాగునీటి పథకాల నిర్వహణకు రూ.1.83 కోట్లు ప్రభుత్వం కేటాయించగా ఈ పనులు పూర్తి చేశారు. రూ.1.53 కోట్ల మేర పనులు రికార్డు చేశారు.

**సంతకాలకే ప్రత్యేకాధికారులు**

అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులు ఉన్నా.. కేవలం సంతకాలకు మాత్రమే పరిమితమవుతున్నారన్న అభిప్రాయాలున్నాయి. నిత్యం గ్రామంలోనే ఉండే కార్యదర్శి ఆయా పనులకు ఖర్చు పెట్టడం తప్పడంలేదు. పంచాయతీ సిబ్బంది వసూలుచేసిన మొత్తాన్ని ఎప్పటికప్పుడు ఎస్టీవోలో జమ చేస్తున్నారు. అయితే వాటిని విడిపించుకునే అవకాశం లేకపోవడంతో కార్యదర్శులకు విధుల నిర్వహణ భారంగా మారింది.

**సొంతంగా ఖర్చు పెడుతున్నాం**

అభివృద్ధి పనులకు కార్యదర్శులు జేబునుండి ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ట్రాక్టర్లు, చెత్త తరలింపు వాహనాలకు ఇంధనం, బ్లీచింగ్ పౌడర్ తదితరాలకు నిధుల్లేవు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వెంటనే పరిష్కరించాలి. సంతోశ్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం**

గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. ఎస్టీవోలో జమచేసే మొత్తాన్ని స్థానిక అవసరాలకు వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. సానుకూలంగా స్పందించారు.
వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

# మహిళ ఆరోగ్యానికి భరోసా

హైదరాబాద్: 'ఆరోగ్య మహిళా క్లినిక్' ఇదివరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ)కు మాత్రమే పరిమితమైంది. ఇప్పుడు ఆ సేవలను వైద్య విధాన పరిషత్ (వీవీపీ) అన్ని ఆసుపత్రుల్లో విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగానే కింగ్‌కోఠి(వీవీపీ) జిల్లా ఆసుపత్రితో పాటు నగరంలోని నాంపల్లి, గోల్కొండ, మలక్‌పేట్ వంటి ఆసుపత్రుల్లో ప్రతీ 'ఆరోగ్య మహిళా క్లినిక్'లు నిర్వహించనున్నారు. మంగళవారం నుంచి ఈ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే దీనిపై కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో వైద్య బృందానికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ విధివిధానాలను తెలియజేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌బాబు చెప్పారు.

**అవగాహన లేకపోవడంతో..**

దేశంలో పెరుగుతున్న క్యాన్సర్ బాధితుల సంఖ్య ఆందోళనకు గురి చేస్తోంది. మహిళల్లో సరైన అవగాహన లేకపోవడంతో రొమ్ము క్యాన్సర్,



ఇతర సమస్యలు బయటకు చెప్పుకోవడానికి భయపడుతూ స్క్రీనింగ్‌లు చేయించుకోవడం లేదు. తద్వారా క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించలేని పరిస్థితి. ఈ సమస్యను అధిగమించాలనే ఉద్దేశంతో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో రొమ్ము, సర్వైకల్, గైనిక్, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, సుఖవ్యాధులకు సంబంధించి సమస్యలతో పాటు థైరాయిడ్ పరీక్షలు చేయనున్నారు.

**జిల్లా ఆసుపత్రిలో..:** కింగ్‌కోఠిలో కూడా ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి జనరల్ సర్జరీ, గైనిక్ విభాగంలో వైద్యులు ప్రాథమిక పరీక్షలు చేస్తారు. అనుమానం ఉంటే అల్ట్రాసౌండ్ చేస్తారు. అదేవిధంగా సర్వైకల్, మెనోపాస్, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు పరీక్షలు చేస్తారు. థైరాయిడ్ సమస్యను జనరల్ మెడిసిన్ వైద్యులు, ఈఎన్‌టీ వైద్యులు కూడా పలు పరీక్షలు నిర్వహిస్తారు. ఏమాత్రం అనుమానం ఉన్నా.. వెంటనే సమస్య ఉన్న చోట నుంచి శాంపిల్ తీసి రోగ నిర్ధారణకు ల్యాబ్‌కు పంపించాల్సి ఉంటుంది.

**వివరాలన్నీ రికార్డులో..** క్లినిక్‌కు వచ్చిన ప్రతి మహిళ ఆరోగ్య వివరాలన్నీ రికార్డు చేస్తామని డా.సంతోష్‌బాబు తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయినవారి వివరాలు నమోదు చేస్తారు. కాకుండా.. మిగతా రోజుల్లో కూడా చెకప్‌లు ఉంటాయి. వారు బుధవారం నుంచి సోమవారం వరకు పరీక్షలకు రావొచ్చు.

# అధ్వానంగా దవాఖానా క్యాంటీన్లు

హైదరాబాద్: గ్రేటర్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వంటశాలలు, క్యాంటీన్లు అధ్వానంగా ఉంటున్నాయి. ఇటీవలి ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో ఆహార కలుషితం కావడంతో వంద మంది వరకు రోగులు అస్వస్థతకు గురికాక.. ఒక రోగి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నగర వ్యాప్తంగా 73 ఆసుపత్రుల్లో మంగళవారం బల్దియా అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని వంటశాలలు, క్యాంటీన్లు ఉన్నాయి. రోగులకు ఆహారం అందించే వంటశాలలు అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. 14 వరకు శాంపిళ్లను సేకరించి.. నాచారంలోని స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్,



2006, రెగ్యులేషన్స్, 2011 ప్రకారం ఆయా నిబంధనలు పాటించని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. పదార్థాలు నిల్వ చేసేందుకు సరైన స్థలం లేకపోవడం, వంటగదులు అపరిశుభ్రంగా ఉండటం, వాషింగ్ ఏరియాలో అపరిశుభ్రత, ఆహార పదార్థాలు నేలపైనే పడవేయటం, ఆహారం పదార్థాలు ఇతర సరకులు కలిపి నిల్వ ఉంచడం, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం తదితర లోపాలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

# బస్తీల్లో బరువు బాధలు!

హైదరాబాద్: బస్తీలపై జీవనశైలి వ్యాధులు(ఎన్‌సీడీలు) దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయం, రక్తపోటు, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్(హెచ్‌హెచ్ఎఫ్) రాజేంద్రనగర్‌లోని ఎంఎం పహాడి, సులేమాన్‌నగర్, చింతల్‌మెట్ ఇతర మరికొన్ని బస్తీల్లోని 12 వేల మందికి పరీక్షలు చేసింది. వారిలో 69 శాతం మంది అధిక బరువు, 25 శాతం మంది గ్రేడ్-2 ఊబకాయ సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొందరు మధుమేహం, అధిక రక్తపోటుతో బాధపడుతున్నప్పటికీ మందులు వాడకుండానే నెట్టుకొస్తున్నారు.

**ఎన్‌సీడీ క్లినిక్‌ల ఏర్పాటు**

మూడు బస్తీల్లో హెచ్‌హెచ్ఎఫ్ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఉచితంగా మధుమేహం, అధిక రక్తపోటు ఇతర సమస్యలకు స్క్రీనింగ్ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ముజ్తబా హసన్ అస్కారీ తెలిపారు. జీవనశైలి వ్యాధులు ఉన్నవారిలో చాలామంది అధిక బరువుతో ఉన్నట్లు తేలింది. బరువు తగ్గితే ఆ వ్యాధులూ నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. ఈ క్లినిక్‌ల ద్వారా రోగులను గుర్తించి చికిత్సకు ప్రభుత్వ ఆసుపత్రులకు పంపనున్నారు. సమతుల ఆహారానికి దూరంగా ఉండటం, శారీరక వ్యాయామం లేకపోవడం, వేళాపాళా లేకుండా తినడం, మద్యపానం, ప్యాకెట్ ఫుడ్ కారణాలతో చాలా మంది తొలుత అధిక బరువు బారిన పడుతున్నారు. అనతి కాలంలో ఊబకాయులుగా మారుతున్నారు. దీంతో సులువుగా మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ బారిన పడుతున్నారు.




## తెలంగాణలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీకి సిద్ధమైంది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు రోజుల క్రితమే డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ థెరపిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైంది. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. జులై 10 నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గడిచిన 17 నెలల్లో 8 వేలకుపైగా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 1,931 మల్టీపర్పస్ ఫీమెల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలు విడుదల కాగా.. మెరిట్ జాబితాలు సిద్ధం చేస్తున్నారు.




## ఆర్థిక సంస్కరణల పితామహుడికి సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్, జూన్ 28: మాజీ ప్రధాన మంత్రి, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.. పీవీకి నివాళులు అర్పించారు.

**భూ సంస్కరణలతో సమానత్వానికి కృషి: భట్టి....** మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు.

ఆర్థిక సంస్కరణలతో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు. భూ సంస్కరణలతో సమాజంలో సమానత్వానికి కృషి చేశారని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా కాంగ్రెస్ ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచిందన్నారు. తెలంగాణలో గత పదేళ్లు పాలించిన ప్రభుత్వం ధరణి తెచ్చి పేదలను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. పేదల హక్కులను కాపాడడానికి భూభారతి చట్టాన్ని తెచ్చామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## దగా క్యాలెండర్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారు: హరీశ్‌రావు



హైదరాబాద్: చలో సచివాలయం కార్యక్రమానికి మద్దతివ్వాలని నిరుద్యోగ యువత కోరారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీల సాధనకు భారాస అండగా ఉంటుందని తెలిపారు. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. భారాస పాలనలో 1.62 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు వస్తాయని యువత ఎన్నో ఆశలు పెట్టుకుందని.. కానీ ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని దుయ్యబట్టారు.

"దగా క్యాలెండర్‌తో నిరుద్యోగ యువతను మోసం చేశారు. నోటిఫికేషన్లు వద్దని యువత ధర్నాలు చేస్తున్నారని రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటించారు.. బాధ్యత లేదా? 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడతాం. కమీషన్లు రావని రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదా?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

## పీవీ ఘాట్‌లో నివాళి అర్పించిన కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద పలువురు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యారంగం బలోపేతం పీవీతోనే సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## 13 మంది మావోయిస్టుల లొంగుబాటు

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో 13 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 8 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.23 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి పునరావాసం కల్పిస్తామని అధికారులు తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టుల వైపు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో పలువురు మావోయిస్టులు లొంగిపోతున్నారు.




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వైఖరితో అగ్రరాజ్యానికి వెళ్లేందుకు అనేక సవాళ్లు ఎదురవుతున్నవేళ ఒక్క వీసా మాత్రం తెగ పాపులర్ అవుతోంది.

అదే ఓ-1 వీసా. అమెరికా వెళ్లాలనుకునే వృత్తి నిపుణులను ఈ మధ్య తెగ ఆకర్షిస్తోన్న వీసా ఇది. ముఖ్యంగా హెచ్-1బీకి ప్రత్యామ్నాయంగా మారిన 'ఓ-1' వీసా కోసం భారతీయులు ప్రయత్నిస్తున్నారు. ఇంతకీ ఏంటీ వీసా? ఎవరికి ఇస్తారు?

**అసాధారణ ప్రతిభ ఉంటే..** యూఎస్ ఇమిగ్రేషన్ యాక్ట్ 1990 కింద ఈ ఓ-1 వీసాను ప్రవేశపెట్టారు. సైన్స్, టెక్నాలజీ, విద్య, వ్యాపారం, అథ్లెటిక్స్ ఆర్ట్స్ అండ్ ఫిల్మ్ అసాధారణ ప్రతిభ, నైపుణ్యాలు కలిగిన వారికి, అద్భుత విజయాలు సాధించినవారికి ఈ వీసాలను మంజూరుచేస్తున్నారు. ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు.. నిర్ణయించిన ఎనిమిది కఠిన ప్రమాణాల్లో కనీసం మూడైనా కలిగిఉండాలి. అవార్డులు, స్కాలర్లీ పబ్లికేషన్లు పొందడం లేదా ప్రతిష్ఠాత్మక సంస్థల్లో సభ్యత్వం కలిగిఉండటం, మీడియా కవరేజీ వంటివి ప్రమాణాలుగా ఉన్నాయి.

**లాటరీ లేకుండానే..** ఈ వీసాకు పలు ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా లాటరీ విధానం గానీ, పరిమితులు గానీ లేకపోవడంతో వీసా రాదన్న భయం ఉండదు. ఏటా దరఖాస్తుదారుల్లో 93 శాతం మందికి వీసాలు మంజూరుచేస్తుంటారు. అదే హెచ్-1బీ అయితే ఆమోదిత రేటు కేవలం 37 శాతమే. ఓ-1 వీసాను తొలుత మూడేళ్ల కాలపరిమితితో జారీ చేస్తారు. ఆ తర్వాత ఎన్నిసార్లయినా పొడిగించుకోవచ్చు. దీన్ని 'లాటరీ లేని హెచ్-1బీ వీసా'గా అభివర్ణిస్తారు. అమెరికా విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. ఏటా ఈ వీసాల జారీ సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది. 2020 ఆర్థిక సంవత్సరంలో 8,838 ఓ-1 వీసాలను జారీ చేయగా.. 2023 ఆర్థిక సంవత్సరంలో ఆ సంఖ్య 18,994కు పెరిగింది. అయితే, దీని దరఖాస్తు రుసుము మాత్రం 10వేల డాలర్ల నుంచి 30వేల డాలర్లుగా ఉంది.

సాధారణంగా హెచ్-1బీ దరఖాస్తుకు అయ్యే ఖర్చు 970 డాలర్ల నుంచి 7,775 డాలర్లుగా ఉంటుంది. ఈ వీసాలను అత్యధికంగా పొందుతున్న వారిలో బ్రిటన్, బ్రెజిల్ తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2020లో 487 మంది భారతీయులకు ఓ-1 వీసా రాగా.. 2023 నాటికి ఆ సంఖ్య 1418కి పెరిగింది.

**టెక్ దిగ్గజాలూ ఓ-1 వైపే..** ప్రస్తుతం హెచ్-1బీ వీసాను పొందడం కష్టతరమవుతున్న సమయంలో భారత సైబర్ నిపుణులు, ఏఐ రీసెర్చర్లు, అథ్లెట్లు, డిజిటల్ కంటెంట్ క్రియేటర్లు ఈ ఓ-1 వీసాను అమెరికాకు వెళ్లేందుకు దగ్గరి దారిగా భావిస్తున్నారు. అటు గూగుల్, టెస్లా, ఓపెన్ ఏఐ వంటి దిగ్గజ సంస్థలు కూడా ఓ-1 వీసా రూట్‌లో నియామకాలు చేపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. హార్వర్డ్, కొలంబియా వంటి విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీ, రీసెర్చర్ల కోసం ఓ-1 వీసాతో నైపుణ్యం గల వారిని నియమించుకుంటున్నారు. లాటరీ సమస్య లేకపోవడం, వీసా జారీ రేటు అత్యధికంగా ఉండటంతో భారత వృత్తి నిపుణులు ఎక్కువగా ఈ వీసాను ఆశ్రయిస్తున్నారు.




హనుమకొండ, జూన్ 28: జిల్లాలో అత్యంత అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళను వివస్త్రను చేసి చిత్రవధ చేసిన ఘటన వెలుగు చూసింది. ధర్మసాగర్ మండలం తాటికాయలలో ఈ దారుణం జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓ మహిళను ఇనుప గ్రిల్స్ కట్టి, వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి చిత్రవధకు గురి చేశారు. తప్పు చేశామని క్షమించాలని వేడుకున్నా కూడా వినకుండా దాడి చేశారు. ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. తాటికాయల గ్రామానికి చెందిన యువతితో మునుగు మండలం బోలోలుపల్లికి చెందిన రాజుకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. అయితే ఇటీవల కాలంలో రాజు.. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. పదిరోజుల క్రితం ఇద్దరు కలిసి గ్రామం నుంచి పారిపోయారు. వీరిద్దరి కోసం గాలించిన రాజు కుటుంబసభ్యులు ఎట్టకేలకు వారిని వెతికి పట్టుకుని తాటికాయల గ్రామానికి తీసుకొచ్చారు. ఆపై మహిళ పట్ల అత్యంత కిరాతకంగా వ్యవహరించారు. ఆమెను ఇనుప గ్రిల్స్‌కు కట్టి వివస్త్రను చేసి జననాంగాలపై జీడి పోసి దారుణంగా చిత్రవధ చేశారు. తరువాత ఇద్దరికీ గుండు గీయించారు. ఐదు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన నేడు వెలుగులోకి వచ్చింది. ఈ దారుణ ఘటన అనంతరం రాజు, మహిళ కనిపించకుండా పోయారు. మహిళపై దాడి దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. దీంతో ధర్మసాగర్ పోలీసులు తాటికాయల గ్రామానికి చేరుకుని దాడిలో పాల్గొన్న కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. మహిళను చిత్ర హింసలకు గురిచేసిన కుటుంబాన్ని అదుపులోకి తీసుకున్నారు. అలాగే కనిపించకుండా పోయిన రాజు, మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## నేను దేనికీ భయపడ: కొండా మురళి




హైదరాబాద్, జూన్ 28: కాంగ్రెస్ పార్టీ అంటే తనకు గౌరవం ఉందని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. ఈరోజు (శనివారం) గాంధీభవన్‌లో క్రమ శిక్షణా కమిటీతో కొండా మురళీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 15 పేజీలతో కూడిన నివేదికను కమిటీకి ఇచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం మాజీ ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌తో కాంగ్రెస్‌పై తనకు అభిమానం పెరిగిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనే తపన తనలో ఉందన్నారు. బహిరంగ విమర్శలు చేయడం మంచిదో చెడునో అంతరాత్మకు తెలుసన్నారు. 'నేను బలహీనుడినా.. బలవంతుడినా అనేది అందరికీ తెలుసు. నన్ను రెచ్చగొట్టొద్దు. నేను రాజీనామా చేసి కాంగ్రెస్‌లోకి వచ్చా. కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి రాజీనామా చేస్తారో లేదో ఆయనే తేల్చుకోవాలి. బీసీలను గౌరవించాలని కోరా. నేను దేనికి భయపడను. సీఎం, పీసీసీ అంటే గౌరవం ఉంది. మళ్ళీ అవసరం వచ్చినప్పుడు వరంగల్‌లో మాట్లాడుతా' అని కొండా మురళి పేర్కొన్నారు. కాగా.. గత కొద్ది రోజులుగా తెలంగాణ కాంగ్రెస్‌లో వివిధ జిల్లాల్లో నాయకుల మధ్య అంతర్గత పోరు కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఒక వర్గంగా.. మిగిలిన ఎమ్మెల్యేలు మరో వర్గంగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న పరిస్థితి. ఈ సమస్యను పరిష్కరించే క్రమంలో ఆ బాధ్యతను క్రమశిక్షణా కమిటీకి అప్పగించింది కాంగ్రెస్ హైకమాండ్. ఈ నేపథ్యంలో ఈరోజు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి గాంధీభవన్‌కు చేరుకుని క్రమశిక్షణ కమిటీతో భేటీ అయ్యారు. కమిటీకి 15 పేజీలతో కూడిన నివేదికను అందజేశారు. గతంలో కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ వివరణ కోరిన నేపథ్యంలో 15 పేజీల లేఖను సమర్పించినట్లు తెలుస్తోంది. కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డిపై కమిటీకి ఫిర్యాదు చేశారు కొండా. ఉమ్మడి వరంగల్‌లో ప్రతీ నియోజకవర్గంలో జరుగుతున్న అంశాలపై నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. కడియం, రేవూరి, నాయినిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కొండా మురళి కోరుతున్నారు.

కాగా.. క్రమశిక్షణా కమిటీ ముందు హాజరయ్యేందుకు వచ్చిన కొండా మురళీకి మద్దతుగా భారీగా అనుచరులు వచ్చారు. అయితే వారిని గాంధీ భవన్ గేటు వద్దే పోలీసులు నిలిపివేశారు.




అధ్యక్ష పదవిని ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పదవిలో ఉండటం చాలా ప్రమాదకరమని ఆయన తెలిపారు. శుక్రవారం వైట్‌హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈసందర్భంగా గతేడాది పెన్సిల్వేనియాలో అధ్యక్ష ఎన్నికల ప్రచార ర్యాలీలో జరిగిన హత్యాయత్నాన్ని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. అధ్యక్ష పదవి ప్రమాదకరమైనదని, ఎన్నో సవాళ్లతో కూడుకొనిఉంటుందని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా అధ్యక్షుడి బాధ్యతలను ఇతర ప్రమాదకరమైన వృత్తులతో ఆయన పోల్చారు. కారు రేసింగ్, బుల్ రైడింగ్ లాగే ఇక్కడ కూడా చావు ఎప్పుడు ఎదురవుతుందో చెప్పలేమన్నారు. ఈవిషయం తనకు ఎవరైనా ముందే చెప్పిఉంటే.. తాను ఈ రేసులో ఉండేవాడిని కాదన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన వృత్తి అని ఆయన ఉద్ఘాటించారు. గతంలో ట్రంప్‌పై పలుమార్లు హత్యాయత్నాలు జరిగిన సంగతి తెలిసిందే. గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌పై హ త్యాయత్నం జరిగింది. పెన్సిల్వేనియాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతుండగా ఓ భవనంపై నక్కిన దుండగుడు కాల్పులు జరిపా డు. ఈ ఘటనలో ట్రంప్ కుడి చెవికి గాయమైంది. ఆ తర్వాత ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్‌బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ఒక వ్యక్తి ఫెన్సింగ్ వద్దకు తుపాకీతో రావడాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి. అనంతరం కాల్పులు జరిపి అతడిని అరెస్టు చేశారు. కొన్ని రోజుల అనంతరం ట్రంప్ పాల్గొన్న సమావేశం సమీపంలో ఉన్న నేషనల్ కన్వెన్షన్ సమీపంలో మాస్క్ ధరించిన ఓ సాయుధ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఆ వ్యక్తి తన వీపున తగిలించుకున్న బ్యాగులో %ూఖ%-47 తుపాకీని మోసుకెళ్లినట్లు ఫాక్స్ న్యూస్ పేర్కొంది.

# 'రెస్పెక్ట్ కావాలి'...

## డీల్ కుదరాలంటే ట్రంప్ కు ఇరాన్ కండిషన్!

ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధం ముగిసిన అనంతరం అణుఒప్పందం ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించడం మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో.. ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధం ఆపినందుకు, తన ప్రాణాలు రక్షించినందుకు ఖమేనీ తనకు కృతజ్ఞతలు చెప్పలేదంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. దీంతో... ఇరాన్ స్పందించింది. రెస్పెక్ట్ లేకపోతే డీల్ కుదరదంటూ స్పష్టం చేసింది. అవును.. ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ని ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను టెహ్రాన్ ఖండించింది. తమతో నిజంగా అణు ఒప్పందం కావాలనుకుంటే ఖమేనీని మర్యాదగా సంబోధించాలని ట్రంప్ కు ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సూచించారు. లక్షలాది మంది ఖమేనీ అభిమానుల మనోభావాలను దెబ్బతీయొద్దంటూ సూచించారు. అసలేం జరిగిందంటే... ఇటీవల పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఖమేనీ హత్యకు గురికాకుండా రక్షించామని, ఆయన కృతజ్ఞత లేనివాడని ట్రంప్ ఓ పోస్టు పెట్టారు. ఖమేనీ ఎక్కడ ఆశ్రయం పొందారో తనకు కచ్చితంగా తెలుసని.. ప్రపంచంలో అత్యంతశక్తిమంతమైన అమెరికా, ఇజ్రాయెల్ దళాల చేతుల్లో ఆయన జీవితాన్ని ముగించనివ్వలేదని అన్నారు. ఇదే సమయంలో... తాను అతనిని



అతి ఘోరమైన చావు నుంచి రక్షించానని.. అయినా, నాకు ఖమేనీ ధన్యవాదాలు తెలపలేదని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చారు. ఈసందర్భంగా ఇరాన్ పై ఉన్న ఆంక్షలను సడలించే విషయాన్ని తాను ఇటీవల పరిశీలించానని తెలిపారు. ఈ వ్యాఖ్యలను టెహ్రాన్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా స్పందించిన ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ.. ఖమేనీని అగౌరవంగా సంబోధించడాన్ని ఖండించారు. ట్రంప్ నిజంగా తమతో ఒప్పందం జరగాలని భావిస్తుంటే తమ సుప్రీం లీడర్ ను మర్యాదగా సంబోధించాలని సూచించారు. లక్షలమంది ఖమేనీ మద్దతుదారుల మనోభావాలను దెబ్బతీయోద్దంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అక్కడితో ఆగని ఆయన... ఇరాన్ ప్రజలు తమ ధైర్యాన్ని ప్రపంచానికి చూపారని.. ఆ సమయంలో ఇజ్రాయెల్ కు మరో దారి లేక ట్రంప్ వద్దకు పరుగెత్తుకెళ్లిందన్నారు. కాగా.. అంతకుముందు... ఖతార్ లోని ఎయిర్ బేస్ పై తాము చేసిన దాడులకు భయపడిన అమెరికా, సీజ్ ఫైర్ కోసం ఇజ్రాయెల్ ను బలవంతంగా ఒప్పించిందని చెప్పిన సంగతి తెలిసిందే.

# ఏఐ స్టార్టప్‌లపై పెట్టుబడులు పెట్టడంలో ఉన్న ప్రమాదాలివీ..



ఏఐ (కృత్రిమ మేధస్సు) రంగంలో పెరుగుతున్న ఆసక్తి పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నప్పటికీ, గార్ట్‌నర్ సంస్థ విడుదల చేసిన తాజా నివేదిక ఒక తీవ్రమైన హెచ్చరికను జారీ చేస్తోంది. 2027 నాటికి 40 శాతం కంటే ఎక్కువ ఏజెంటిక్ AI ప్రాజెక్టులు నిలిపివేయబడతాయని ఈ నివేదిక అంచనా వేస్తోంది. దీనికి ప్రధాన కారణాలు అధిక నిర్వహణ ఖర్చులు, భద్రతాపరమైన సమస్యలు, స్పష్టమైన వ్యాపార లాభాలు లేకపోవడమే.

**– హైప్ వెనుక దాగున్న వాస్తవం..** ఏఐపై ప్రచారం జోరుగా సాగుతున్నప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉన్నాయి. పటిష్టమైన ప్రణాళికల కంటే "హైప్" వాటిని ఎక్కువగా ప్రభావితం చేస్తోంది. గార్ట్‌నర్ 3,400కు పైగా ఏఐ విక్రేతలను సర్వే చేయగా కేవలం 130 కంపెనీలు మాత్రమే నిజమైన, కొత్త ఏజెంటిక్ AI టూల్స్‌ను అందిస్తున్నాయని తేలింది. ఇతర సంస్థలు పాత సాంకేతికతలను ఉదాహరణకు చాట్‌బాట్‌లు, ఆటోమేషన్ వంటి వాటిని "కొత్త ఏఐ"గా ముద్ర వేసి మార్కెట్ చేస్తూ "ఏజెంట్ వాషింగ్" అనే తప్పుడు పద్ధతిని అనుసరిస్తున్నాయి. ఇది వ్యాపార సంస్థలు సరైన పరిష్కారాలను ఎంచుకోవడంలో గందరగోళానికి దారితీస్తోంది.

**–తప్పుడు అంచనాలు, వ్యర్థమవుతున్న వనరులు...** విశ్లేషకురాలు అనుశ్రీ వర్మ చెప్పినట్లుగా "చాలా ప్రారంభ ఏఐ ప్రాజెక్టులు తప్పుగా అర్థం చేసుకోబడుతున్నాయి, వాటిని తప్పుగా అమలు చేస్తున్నారు. అవాస్తవిక అంచనాలతో ప్రారంభించి, వాస్తవ ఖర్చు , సంక్లిష్టత తెలిసినప్పుడు మధ్యలోనే వాటిని విరమిస్తున్న సంస్థలు పెరుగుతున్నాయి." ఇది మొత్తం పరిశ్రమకు సమయం, డబ్బు, మానవ వనరుల నష్టానికి దారితీస్తోంది.

**– భవిష్యత్తులో ఏఐకి ఆశాజనక అవకాశాలు...** ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, ఏఐ భవిష్యత్తుకు బలమైన అవకాశాలు ఉన్నాయని నివేదిక ఆశాజనకంగా చెబుతోంది. 2028 నాటికి ఏజెంటిక్ %ూ×% ఆధారంగా వ్యాపార సంస్థలలో రోజువారీ నిర్ణయాల్లో 15 శాతం వాటా ఉండొచ్చని, అలాగే సంస్థల సాఫ్ట్‌వేర్‌లలో మూడవ వంతు ఏఐ ఆధారంగా పనిచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**–పెట్టుబడిదారులకు కీలక హెచ్చరిక...** ఇది పెట్టుబడిదారులకు ఒక స్పష్టమైన హెచ్చరికగా మారాలి. ప్రస్తుతం ఏఐ స్టార్టప్‌లపై మిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెడుతున్న వెంచర్ క్యాపిటలిస్టులు, వాటిలో చాలా వరకు అంతగా విజయం సాధించలేకపోవచ్చని గ్రహించాలి. కొన్ని మాత్రమే నిలదొక్కుకుంటే తప్ప, మిగతావి మార్కెట్‌లో నశించిపోయే ప్రమాదం ఉంది. ఒక విశ్లేషకుడు చెప్పినట్లుగా "కాగితం మీద చాలా ఏఐ స్టార్టప్‌లు గొప్పగా కనిపించవచ్చు. కానీ వాస్తవ జీవితంలో వాటిని అమలు చేస్తే అవి అవసరం లేని పేజర్లు మాదిరిగా త్వరగా ప్రాసంగికత కోల్పోతాయి. మొబైల్ రాకతో పేజర్ల పరిస్థితి ఎలా అయిందో, కొన్ని స్టార్టప్స్ పరిస్థితి కూడా అలాంటిదే అవుతుంది."

**– విజయానికి మార్గం: సమగ్ర పరిశీలన...** కాబట్టి ఏఐ స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టేముందు గట్టి పరిశీలన, వాస్తవ అంచనాలు, టెక్నాలజీ నిపుణుల సలహాలు తీసుకోవడం అత్యంత కీలకం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలివ్వగల స్టార్టప్‌లను గుర్తించడమే విజయానికి మార్గం. అపరిమితమైన హైప్‌ను నమ్మకుండా, నిశితంగా పరిశీలించి పెట్టుబడులు పెట్టడం తెలివైన పని.

# ప్రముఖ టీవీ యాంకర్ ఆత్మహత్య.. కారణమేంటి?

తెలుగు జర్నలిజం ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన వార్త... న్యూస్ యాంకర్ స్వేచ్ఛ వోటార్కర్ ఆకస్మిక మరణం. ధైర్యం, నిజాయితీ, సామాజిక బాధ్యతకు నిలువెత్తు రూపమైన స్వేచ్ఛ ఇంత అమాయకంగా జీవితం ముగించుకుందా అనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఆమె మరణం వెనుక ఉన్న అసలు నిజం ఏంటి? ఇది ఆత్మహత్యేనా? ఆమె మరణానికి కారణం ఏంటన్న ప్రశ్నలు ఇప్పుడు మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. స్వేచ్ఛ తన జర్నలిస్టిక్ కెరీర్‌ను ఓ ప్రముఖ టాప్ ఛానెల్‌లో ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగారు. న్యూస్ ప్రెజెంటర్‌గా మాత్రమే కాకుండా, మానవీయ అంశాలను వెలికి తీయడంలో ఆమెకి ఉన్న ప్రత్యేకత ద్వారా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజల సమస్యలపై ఆమె చేసిన కథనాలు ఎంతో మంది హృదయాలను తాకాయి. ఆమె టీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శిగా కూడా సేవలందించారు. అయితే వృత్తిపరంగా ఎంతో ధైర్యంగా వ్యవహరించిన స్వేచ్ఛ, తన వ్యక్తిగత జీవితంలో మాత్రం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నట్టు ఇప్పుడు సమాచారం వస్తోంది. ఆమెకు ఒక కుమార్తె ఉన్నది. గతంలో భర్తతో విడాకులు తీసుకున్నది, తాజాగా ఓ మాజీ సహచరుడితో సహజీవనం కొనసాగిస్తోందని మీడియా వార్త



లు వస్తున్నాయి. అతడితో దిగిన ఫొటోలను చనిపోవడానికి ఒకరోజు ముందు ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది. 'మనసును కామ్ గా ఉంచుకో ఆత్మనే మాట్లాడుతుంది' అని ఆమె చివరకు కొన్ని ఫొటోలు షేర్ చేసి ఆత్మహత్య చేసుకుంది. ఆ ఫొటోల్లోని వ్యక్తితో ఇటీవల విభేదాలు పెరిగినట్టు సన్నిహితులు చెబుతున్నారు.

**– చిక్కడపల్లిలో ఆ విషాదం..** హైదరాబాద్‌లోని చిక్కడపల్లి ప్రాంతంలోని జవహర్‌నగర్‌లో తన కుమార్తెతో కలిసి నివసించిన స్వేచ్ఛ, అదే ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతదేహంగా కనిపించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని చెబుతున్నా, పోలీసులు మాత్రం దీనిని అనుమానాస్పద మరణంగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నారు.

**–పోలీసుల దర్యాప్తు.. కీలక అనుమానాలు...** స్వేచ్ఛ తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అదే వ్యక్తితో విభేదాలే ఆమెను ఇంత దారుణ నిర్ణయం తీసుకునేలా చేశాయా? లేక మరెవరో ఈ మృతికి కారణమా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆ వ్యక్తి ఆమె నివాసానికి రాకపోవడం, స్వేచ్ఛ తన సన్నిహితులకు కొన్ని విషయాలు చెప్పినట్టు సమాచారం ఉండటం ఈ కేసును మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి.

## సినిమా 'షో'

# అనుష్క ఇదేం కరెక్ట్ కాదమ్మి..!

స్వీటీ అనుష్క ఘాటి సినిమా కోసం ఆమె ఫ్యాన్స్ కళ్లు కాయలు కాచేలా వెయిట్ చేస్తున్నారు. క్రిష్ డైరెక్షన్లో తెరకెక్కుతున్న ఈ సినిమా అసలైతే ఏప్రిల్ సెకండ్ హాఫ్ రిలీజ్ చేయాలని అనుకున్నారు కానీ సినిమా పూర్తి కాకపోవడంతో వాయిదా వేశారు. యువి క్రియేషన్స్ బ్యానర్ లో రూపొందుతున్న ఘాటి సినిమా విషయంలో మేకర్స్ నుంచి కూడా ఎలాంటి అప్డేట్స్ రావట్లేదు. నిశ్శబ్దం తర్వాత నాలుగేళ్లు గ్యాప్ ఇచ్చిన అనుష్క లాస్ట్ ఇయర్ మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టిలో నటించింది. ఆ సినిమా సక్సెస్ అయినా కూడా అనుష్క మళ్లీ వరుస సినిమాలు చేయట్లేదు. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది అనుకోవడం ఫ్యాన్స్ వంతు అయ్యింది. పోనీ కమిటైన క్రిష్ ఘాటి సినిమాకైనా అడిగిన డేట్స్ ఇస్తుందా అంటే సినిమా ఎప్పుడు పూర్తవుతుందా అన్నట్టుగా ఉందట. అనుష్క ఇంట్రెస్ట్ లేకుండానే



సినిమాలు చేస్తుందా అనుకుంటున్నారు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా అదరగొట్టిన అనుష్క కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ సినిమాలను చేస్తూ వచ్చింది. అరుంధతి, రుద్రమదేవి లాంటి సినిమాలు చేయాలంటే అనుష్క వల్లే అవుతుందని ప్రూవ్ చేసుకుంది. ఐతే బాహుబలిలో కూడా ఆమె తన అందంతో మెప్పించింది. ఐతే తన లుక్స్ వైజ్ ఇంకా ఇదివరకులా లేదన్న కారణం చేతనే అనుష్క సినిమాలు చేయట్లేదు. ఐతే క్రిష్ సినిమా ఎలాగు చివరి దశకు వచ్చింది కాబట్టి దాన్ని పూర్తి చేసి నెక్స్ట్ ఏం చేయాలి అన్నది చూస్తుందట. ఘాటితో పాటు అనుష్క ఒక మలయాళ సినిమాకు కూడా సైన్ చేసింది. ఆ సినిమా ఎంతవరకు వచ్చిందో కూడా తెలియాల్సి ఉంది. అనుష్క ఎందుకు ఇలా చేస్తుంది.. ఆమె కెరీర్ గ్యాప్ కి అసలు రీజన్స్ ఏంటన్నది తెలియాల్సి ఉంది. ఘాటి సినిమా టీజర్ తో సర్ ప్రైజ్ చేసిన అనుష్క మళ్లీ తిరిగి ఫాంలోకి వస్తుందని అనుకున్నారు. కానీ సినిమాని లేట్ చేస్తూ ఆడియన్స్ లో ఉన్న ఇంట్రెస్ట్ ని కోల్పోయేలా చేస్తున్నారు. ఘాటి పూర్తైతే కానీ అనుష్క నెక్స్ట్ సినిమాల గురించి అప్డేట్ వచ్చే ఛాన్స్ ఉంటుంది. తెర మీద అనుష్కని మిస్ అవుతున్న ఆమె ఫ్యాన్స్ మాత్రం ఎప్పుడొచ్చినా ఆమెను ఎంకరేజ్ చేసేందుకు రెడీగా ఉన్నారు. ఘాటి తర్వాత అనుష్క సినిమాలు చేసినా కాస్త స్పీడ్ గా చేస్తే బాగుంటుందని అంటున్నారు.

# టాలీవుడ్ స్టార్‌లకు సమ్మర్ బ్రేక్



టాలీవుడ్ లో ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులు సెట్స్ పై ఉన్న విషయం తెలిసిందే. తెలుగు సినిమా స్థాయి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన నేపథ్యంలో స్టార్ హీరోలు నటించే ప్రతీ సినిమానీ నిర్మాతలు భారీ బడ్జెట్ లతో నిర్మిస్తున్నారు. దీంతో ఒకప్పుడు తెలుగు సినిమాను పట్టించుకోని వాళ్లందరూ కూడా ఎప్పుడెప్పుడు ఆయా సినిమాలు రిలీజవుతాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్ లో సెట్స్ పై ఉన్న భారీ సినిమాల్లో హరిహర వీరమల్లు, ఓజి, రాజా సాబ్, ఫౌజి, డ్రాగన్, పెద్ది. స్టార్ హీరోలు నటిస్తున్న ఈ సినిమాలను నిర్మాతలు భారీగా పాన్ ఇండియా స్థాయిలో రూపొందిస్తున్నారు. వారిలో ఎన్టీఆర్ తప్ప మిగిలిన స్టార్ హీరోలంతా సమ్మర్ లో ఈ షూటింగుల నుంచి బ్రేక్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో డ్రాగన్ షూటింగ్ లో బిజీగా ఉన్నాడు ఎన్టీఆర్. మరికొద్ది రోజుల్లో ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్ పూర్తవడంతో ఎన్టీఆర్ కూడా బ్రేక్ తీసుకోబోతున్నాడని వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ మినహా మిగిలిన హీరోలంతా ఆల్రెడీ షూటింగ్స్ నుంచి బ్రేక్ లోనే ఉన్నట్టు తెలుస్తోంది. అందులో ముఖ్యంగా మొదట చెప్పుకోవాల్సింది పవన్ కళ్యాణ్ గురించి. పవన్ పాలిటిక్స్ లో బిజీగా ఉండటం వల్ల ప్రస్తుతం షూటింగ్స్ కు హాజరయ్యే తీరిక లేదు. అందుకే షూటింగ్స్ నుంచి పవన్ బ్రేక్ లో ఉన్నాడని అంటున్నాం. ఒకవేళ పవన్ కు కుదిరి డేట్స్ అడ్జస్ట్ చేస్తే ఎంత సమ్మర్ లో అయినా సరే షూటింగ్ ను పూర్తి చేయడానికి రెడీగా ఉన్నారు హరిహర వీరమల్లు, ఓజి చిత్ర మేకర్స్. ఇక సూపర్ స్టార్ మహేష్ బాబు రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడు. ఆల్రెడీ రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఎస్ఎస్ఎంబీ29 టీమ్, తర్వాతి షెడ్యూల్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో బ్రేక్ వచ్చింది. దీంతో మహేష్ ఖాళీగా ఉన్నాడు. బుచ్చిబాబు సానతో రామ్ చరణ్ చేస్తున్న పెద్ది షూటింగ్ కు సమ్మర్ కారణంగా చరణ్ బ్రేక్ ఇచ్చాడు. ప్రభాస్ మోకాలి గాయం వల్ల సర్జరీ చేయించుకుని ఆల్రెడీ గత కొంతకాలంగా రెస్ట్ లోనే ఉన్నాడు. ఇక అల్లు అర్జున్, అట్లీతో చేయబోయే సినిమా కన్ఫర్మ్ అయినప్పటికీ ఆ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి చేసుకుని మొదలయ్యే సరికి జూన్ వచ్చేస్తుంది. సో టాలీవుడ్ స్టార్ హీరోలంతా సమ్మర్ లో బ్రేక్ లో ఉన్నట్టే అని చెప్పుకోవాలి.

# టాప్ లెస్ ఫోజులో గుబులు రేపిన సోనమ్

ఈ భూప్రపంచంలో ఎన్నో సంస్కృతులు, ప్రాంతాన్ని బట్టి, దేశాన్ని బట్టి.. భాష వేషం సంస్కృతి ప్రతిదీ మారిపోతాయి. అలాగే ఈజిప్షియన్ కల్చర్ లో అత్యంత పురాతనమైన సంస్కృతి.. అక్కడి సమాధులు నిర్మాణాలు, వాటి వెనక కథలు ప్రజల హృదయాల్లో పాతుకుపోయాయి. మమ్మీ, మమ్మీ 2 సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విడుదలై సంచలన విజయం సాధించడం వెనక ఈజిప్ట్ కల్చర్ లో దాగి ఉన్న పురాణేతిహాస కథలు, పాత్రల యూనివర్సల్ అప్పీల్ ఒక కారణం అనడంలో సందేహం లేదు. చూస్తుంటే, ఇక్కడ భారతీయ ఫ్యాషనిస్టా సోనమ్ కపూర్ ఈజిప్ట్ టోంబ్ నుంచి నిదుర లేచిన మమ్మీలా కనిపిస్తోంది. ఆ నుదుటిన భారీతనం నిండిన పాపిడి బొట్టులాంటి ఆ హారం.. ఇన్నర్ ఏదీ ధరించకుండా డ్యాషింగ్ టాప్ లెస్ ఫోజుతో




సోనమ్ తాజా ఫోటోషూట్ లో కట్టి పడేసింది. 39ఏళ్ల బ్యూటీ గ్లామర్ క్వీన్ ని తలపించింది. ఈ లుక్ చూడగానే గోల్డెన్ గాళ్ సోనమ్ అదిరిపోయింది అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. సోనమ్ కపూర్ అందాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఈ ఫ్యాషనిస్టా 14వ సారి వోగ్ ఇండియా కవర్ గర్ల్‌గా మెరుపులు మెరిపించింది. మేకప్ ఆర్టిస్ట్ నమ్రతా సోని సోనమ్ లుక్ ని డిజైన్ చేయగా, అది తన స్థాయిని అమాంతం పదింతలు పెంచింది. ఈ రూపం కోసం ఎంపిక చేసుకున్న మేకప్, వస్త్రాభరణాలు ప్రతిదీ వేటికవే ప్రత్యేకం. సోనమ్ కపూర్ గోల్డెన్ గర్ల్ స్టైల్, గ్లామ్ అవతార్ యువతరం హృదయాలను సున్నితంగా టచ్ చేసింది.

వీరే ది వెడ్డింగ్, ఏకే వర్సెస్ ఏకే, బ్లైండ్ వంటి చిత్రాలలో నటించాక, సోనమ్ నటనకు దూరంగా ఉంది. ప్రస్తుతం భర్తతో కలిసి విదేశాల్లో వ్యాపారాలను చక్కదిద్దుకుంటోంది.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417